# గుజరాత్ ప్రజలపై మరొక నిర్బంధ చట్టం

**కేంద్ర** ప్రభుత్వాన్ని పాలిస్తున్న బి.జె.పి. పాలకులు, ఒకవైపు వలస కాలంనాటి చట్టాలను – ఇండియన్ పీనల్‌కోడ్, క్రిమినల్ ప్రొసీజరు కోడ్‌లను – నిశితంగా పరిశీలించి మెరుగు పరుస్తామని, అందుకు ప్రక్రియ మొదలైందనీ చెప్తూనే, మరోవైపు తమ పార్టీ పాలనలోనే వున్న గుజరాత్ రాష్ట్రంలో, పోలీసులకు మరిన్ని అధికారాలను యిచ్చే చట్టాలకు అనుమతినిచ్చారు.

సరీగ్గా గుజరాత్‌లో ఎన్నికలు జరగటానికి ఒక నెల ముందే అటువంటి చట్టానికి అనుమతిని మంజూరుచేశారు. గుజరాత్ అసెంబ్లీ మార్చి 2021లో కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్ (గుజరాత్ అమెండ్‌మెంటు) బిల్లు అన్న దానిని ఆమోదించింది. ఇప్పుడు ఈ బిల్లు, కేంద్ర ప్రభుత్వ అనుమతితో చట్టంగా మారింది.

ఈ నూతన చట్టప్రకారం యిప్పుడు పోలీసులు స్థానిక కోర్టులకు వ్రాతపూర్వకంగా తెలియచేయవల్సిన అవసరం లేకుండానే, 144వ సెక్షన్‌ను ధిక్కరిస్తూ నిరసనలు, ఆందోళన జేశారంటూ అరెస్టు చేసి, కేసులు నమోదు చేయవచ్చు. గతంలో అయితే అటువంటి కేసులు, స్థానిక మేజిస్ట్రేటుకు వ్రాత పూర్వకంగా తెలియపరచకుండా పోలీసులు నమోదుచేసే అధికారం లేదు. అందువలన, ఏదోమేరకు పోలీసులు విచ్చలవిడిగా అరెస్టు చేయకుండా, కేసులు పెట్టకుండా వుండే పరిస్థితి వుండేది. ఇప్పుడు పోలీసులు, 144వ సెక్షన్‌ను అతిక్రమించారనే నెపంతో, యిష్టారాజ్యంగా కేసులు నమోదు చేయవచ్చు.

నిరంతరం ఏదో ఒక కల్పిత సమస్యను ముందుకు తీసుకువచ్చి, లేదా ప్రజావ్యతిరేక విధానాన్ని ముందుకు తెచ్చి ప్రజల్లో కల్లోలం సృష్టించటం, ఆ రకంగా వారు ఐక్యంగా వుండకుండా, తమ మౌలిక సమస్యల గురించి ఆలోచించకుండా వుండే వ్యూహాన్ని పాటిస్తూ బి.జె.పి. రాజ్యమేలుతోంది. ఈ విధానం వల్ల అనివార్యంగానే, ప్రజలు నిరసనలు, ఆందోళనలు జరపాల్సిన అనివార్య పరిస్థితులలోకి నెట్టబడుతున్నారు. తిరిగి ఆరకంగా, అనివార్యంగా నిరసనలలోకి దిగే ప్రజలను, ప్రస్తుత చట్టపు ఆసరాతో నిర్బంధాన్ని, అక్రమ కేసులను పోలీసులు మరింతగా పెంచుతారు. చావగొట్టి, చెవులు మూసి ప్రజలను పాలించాలన్న బిజెపి పాలకుల యొక్క వైఖరి, విధానాలు యీ చట్టానికి అనుమతి నివ్వటం వలన మరొకసారి వెల్లడవుతోంది.

ఒకవైపు నిరసన తెలిపే హక్కు రాజ్యాంగం ప్రజలకు యిచ్చిందని ప్రచారం చేస్తూనే, ఆ హక్కును హరించే ప్రయత్నమే తప్ప, ఇది ఏరకంగానూ రాష్ట్రంలో, శాంతి – భద్రతలు నిర్వహించటానికి కాదని అర్థంచేసుకోవాలి!

ఇటువంటి నిర్బంధ చట్టాలను, ప్రజాస్వామిక చైతన్యంతో, ప్రజలు వ్యతిరేకించాలి!

*****